
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

పశ్చిమ గోదావరి
జిల్లా వార్తలు
5
శనివారం 24 ఆగస్టు 2024

భీమవరం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 33.0 కనిష్ఠం : 26.0
తేమ : 32.0 - 27.0

ఆగని వర్షం.. రోడ్లు జలమయం


చెరువును తలపిస్తున్న నరసాపురం మెయిన్‌రోడ్

నరసాపురం టౌన్/మొగల్తూరు, ఆగస్టు 23: నిన్న, మొన్నటి వరకు వేసవిని తలపించే ఎండలు, ఉక్కపోతతో అల్లాడిన ప్రజలు గురువారం రాత్రి నుంచి శుక్రవారం మధ్యాహ్నం వరకు కురిసిన భారీ వర్షంతో సేదతీరారు. నరసాపురంలో ఉదయం ఆరు నుంచి పది గంటల వరకు ఎడతెరిపి లేకుండా ఉరుములతో కురిసిన వర్షానికి పల్లపు ప్రాంతాలు నీట మునిగాయి. మెయిన్‌రోడ్ చెరువును తలపించింది. మిగిలిన ప్రాంతాల్లోనూ మోకాలు లోతు మేర నీరు నిలిచింది. ఉదయం స్కూళ్ళు, కాలేజీల సమయం కావడంతో రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది. పెళ్లి ముహూర్తాలు ఎక్కువగా ఉండటంతో మండపాల వద్ద చేసిన డెకరేషన్ పాడైంది. సాయంత్రం వరకు ఆకాశం మేఘావృతమై ఉండటంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. వైఎస్ పాలెంలో పిడుగులు పడి కొబ్బరి చెట్లు, విద్యుత్ వైర్లు దెబ్బతిన్నాయి.


నీటిలో మొగల్తూరు హైస్కూల్

మొగల్తూరులో 30.6 మిల్లీ మీటర్ల వర్షం కురవడంతో పల్లపు ప్రాంతాలతోపాటు ప్రధాన రహదారిపై నీరు నిలిచింది. మొగల్తూరు గొల్లగూడెం, ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే రోడ్లపై వర్షం నీరు నిలిచిపోవడంతో వాహనదారులు, స్థానికులు ఇబ్బందులు పడ్డారు. చేలల్లో వర్షం నీరు లాగక మునిగిపోయాయి.




వరలక్ష్మి వైభవం

శ్రావణమాసం మూడో శుక్రవారం మావుళ్ళమ్మ ఆలయంలో సామూహిక ఉచిత వరలక్ష్మి వ్రతాలు నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు మద్దిరాల మల్లికార్జునశర్మ ఆధ్వర్యంలో 700 మంది మహిళలు పూజలో పాల్గొన్నారు. పూజా సామగ్రిని దేవస్థానం అందించింది.

వికసిత పాలన

గ్రామసభలు సూపర్ సక్సెస్

- జోరువానలో సాగిన ఉపాధి సభలు
- సమస్యలను ప్రస్తావించిన ప్రజలు
- పరిష్కారానికి ఎమ్మెల్యేలు, అధికారుల హామీ
- సభల విజయవంతంపై అంతటా హర్షం

భీమవరం టౌన్, ఆగస్టు 23 : కూటమి ప్రభుత్వంలో గ్రామపాలన వికసించింది. ప్రజలకు భాగస్వామ్యం లభించింది. పల్లె జనం అనుమతితో అభివృద్ధి పనులకు ఆమోదముద్ర పడింది. ప్రభుత్వ పిలుపు మేరకు జిల్లాల్లోని 409 పంచాయతీల్లో ఒకేరోజు గ్రామసభలు నిర్వహించారు. జనం పెద్ద ఎత్తున హాజరయ్యారు. గ్రామంలోని సమస్యలను విన్నవించుకున్నారు. మంత్రి నిమ్మల రామానాయుడు, ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు గ్రామసభల్లో పాల్గొన్నారు. కూటమి పార్టీల నియోజకవర్గ ఇన్‌చార్జులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు హాజరయ్యారు. ఐదేళ్లుగా ఎదురవుతున్న ప్రజా సమస్యలపై గొంతు విప్పారు. రహదారులు, డ్రైన్‌లు, మంచినీరు, వీధి దీపాల వంటి వాటిని ప్రస్తావించారు. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత అభివృద్ధి పనులకు నిదులు కేటాయించినట్లు ఎమ్మెల్యేలు, కూటమి నాయకులు వివరించారు. పాలకొల్లు రూరల్ మండలం లంకలకోడేరులో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, కలెక్టర్ చదలవాడ నాగరాణి హాజరయ్యారు. వీరవాసరంలో భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు), కలెక్టర్‌తో కలిసి సభలో పాల్గొన్నారు. ఉండికి సంబంధించి జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి, జనసేన నాయుడు జుత్తిగ నాగరాజు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు. తాడేపల్లిగూడెంలో ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వలవల బాబ్జి, కూటమి నాయకులు పాల్గొన్నారు. నరసాపురంలో ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్, టీడీపీ నాయకుడు పొత్తూరి రామరాజు పాల్గొన్నారు. వర్షం కురుస్తున్నప్పటికీ గ్రామసభలకు అనుకున్న స్థాయిలో ప్రజలు భాగస్వామ్యం కావడంతో నాయకులలో సంతృప్తి వ్యక్తమవుతోంది. ఐదేళ్లుగా పంచాయతీలు ఎలా నిర్వీర్యమయ్యాయో ప్రజా ప్రతినిధులు ప్రజలకు వివరించారు. గ్రామాలు అభివృద్ధి చెందాలంటే ఐకమత్యంతో ముందుకు వెళితేనే సాధ్యమవుతుందని అన్నారు.



భీమవరం, పాలకొల్లు నియోజకవర్గాల్లో జరిగిన సభల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అంజిబాబు, మంత్రి రామానాయుడు, చిత్రంలో కలెక్టర్ నాగరాణి, మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్ తదితరులు

జనం ఆగ్రహం.. వెళ్లిపోయిన సర్పంచ్

- నత్తా రామేశ్వరంలో గత ఏడాది నిర్మించిన రహదారులు ప్రజలకు ఉపయోగం లేదని, నివాస ప్రాంతాలు లేని ప్రాంతాల్లో వీటిని నిర్మించారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తూ సభ దృష్టికి తెచ్చారు. దీంతో వేదికపైన వున్న గ్రామ సర్పంచి గలగల ధర్మారెడ్డి అక్కడి నుంచి వెళ్లిపోయారు.


తాడేపల్లిగూడెంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొలిశెట్టి


నరసాపురంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాయకర్


గణపవరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధర్మరాజు

పంచాయతీలకు ఊపిరి పోస్తున్నాం

- మంత్రి నిమ్మల

పాలకొల్లు రూరల్, ఆగస్టు 23 : వైసీపీ ప్రభుత్వం పంచాయతీలను నిర్వీర్యం చేస్తే, నేడు ఎన్డీఏ ప్రభుత్వం ఊపిరి పోస్తోందని మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. లంకలకోడేరులో శుక్రవారం జరిగిన ఉపాధి హామీ పథకం గ్రామ సభలో మంత్రి మాట్లాడారు. 'రాష్ట్రవ్యాప్తంగా 2014-19ల్లో పంచాయతీల ఆదాయం రూ.240 కోట్లు. 2019-23 నాటికి రూ.170 కోట్లకు పడిపోయింది. గత ప్రభుత్వం పంచాయతీలను విస్మరిస్తే మేం కూటమి ప్రభుత్వం జవసత్వాలను కల్పిస్తున్నాం. పంచాయతీలకు తొలి విడతగా రూ.1,400 కోట్లు విడుదల చేశాం' అని తెలిపారు. కలెక్టర్ సీహెచ్ నాగరాణి మాట్లాడుతూ ఉపాధి హామీలో భాగంగా కార్మికులకు 15 రోజుల్లోగా నగదును వారి బ్యాంక్ ఖాతాలకు జమ చేస్తామన్నారు. ఆర్డీవో ఎం.అచ్యుత అంబరీష్, మాజీ ఎమ్మెల్సీ అంగర రామమోహన్, డ్వామా పీడీ ఎం.ప్రభాకర రావు, పంచాయతీరాజ్ జిల్లా అధికారి ఎస్.శ్రీనివాసరావు, లేబర్ కమిషనర్ ఎ.లక్ష్మి, తహశీల్దార్ వై.దుర్గాకిశోర్, ఎంపీడీవో వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



నరసాపురం తహసీల్దార్‌గా గుర్నాథరెడ్డిని నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఆయన విధుల్లో చేరేందుకు సంసిద్ధమయ్యారు. సిబ్బంది కూడా కొత్త తహసీల్దార్‌కు స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేశారు. ఇంతలో మహిళా తహసీల్దార్ వచ్చి విధుల్లో చేరారు. గత ప్రభుత్వంలో తహసీల్దార్ గుర్నాథరెడ్డి వైసీపీకి వంత పాడారన్న విమర్శలున్నాయి. కూటమి ప్రభుత్వం వద్ద నివేదికలు ఉన్నాయి. అయినా పైరవీలు చేసి వచ్చేందుకు ప్రయత్నించినప్పటికీ ఆయనకు ఫలితం దక్కలేదు. ప్రభుత్వస్థాయిలో నిర్ణయం మారింది.

వైసీసీ హయాంలో పౌరసరఫరాల డిప్యూటీ తహశీల్దార్‌గా పనిచేసిన ఓ మహిళా అధికారి అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్నారు. అప్పట్లో మాజీ మంత్రి పేరును వినియోగించుకుని రేషన్ డీలర్లను ఉక్కిరిబిక్కిరి చేశారు. తర్వాత విచారణను ఎదుర్కొని బదిలీ అయ్యారు. తిరిగి అదే ప్రాంతానికి వచ్చేందుకు ఎమ్మెల్యే సిఫారసు కోసం ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు.

ప్లీజ్.. మమ్మల్ని తీసుకోరూ

వైసీపీ హయాంలో చెలరేగిన అధికారులు.. నేడు కూటమి నేతల చుట్టూ ప్రదక్షిణలు

వీరికి కీ ప్లేస్‌లో పోస్టింగులు ఇవ్వద్దని ప్రభుత్వం ఆదేశాలు

సమర్ధత కలిగిన ఉద్యోగుల వైపే ప్రజా ప్రతినిధుల చూపు

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

బదిలీలకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేయడంతో తాము కోరుకున్న చోటకు వెళ్లడానికి అధికారులు, ఉద్యోగులు అన్ని దారులు వెతుక్కుంటున్నారు. ఎమ్మెల్యేలు, కూటమి నేతల సిఫారసుల కోసం విశ్వ ప్రయత్నాలు చేస్తూ వారి చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. నెలన్నరగా సిఫారసు లేఖలు తీసుకుంటున్నారు. అయితే వైసీపీ హయాంలో ఎమ్మెల్యేలు, మంత్రులకు పీఏలుగా, పీఎస్‌లుగా పనిచేసిన ప్రభుత్వ ఉద్యోగులను తీసుకోవద్దంటూ కూటమి ప్రజాప్రతినిధులకు ఆదేశాలు వచ్చాయి. అప్పటిలో పనిచేసిన ఉద్యోగులు మళ్లీ కూటమి నేతల వద్దకు చేరేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు.

వైసీపీ హయాంలో వివాదరహితులు, పాలనలో సమర్థులుగా గుర్తింపు పొందిన అధికారులను జిల్లాకు రప్పించుకోవడానికి కూటమి నాయకులు ఆసక్తి చూపుతున్నారు. భీమవరంలో ఆర్డీవోగా పనిచేసి అందరి మన్ననలు పొందిన అధికారిని మళ్లీ తమ సొంత డివిజన్‌కు రప్పించుకోవడానికి మంత్రి నిమ్మల రామానాయుడు దృష్టి పెట్టారు. పంచాయతీరాజ్‌లో పనిచేసిన అధికారి కావాలంటూ జిల్లా ప్రజా ప్రతినిధులంతా సిఫారసు లేఖలు ఇచ్చారు. అటువంటి అధికారిని రప్పించుకుంటే జిల్లాకు మంచి జరుగుతుందని గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. అయితే వైసీపీ హయాంలో అతి చేసిన అధికారులపై మాత్రం వేటు పడుతోంది. ఇప్పటికే డివిజన్, సర్కిల్ స్థాయి పోలీస్ అధికారులు కొందరికి పోస్టింగ్ ఇవ్వకుండా బదిలీ చేశారు. సరెండర్ చేస్తూ సంబంధిత అధికారుల వద్ద రిపోర్ట్ చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. కూటమి నేతల ఫిర్యాదుతోనే ప్రభుత్వం ఇటువంటి నిర్ణయం తీసుకుంది. డిప్యూటేషన్‌పై వచ్చిన మున్సిపల్ అధికారులను వారి సొంత విభాగాలకు పంపుతోంది. ఎన్నికల ముందే తాడేపల్లిగూడెం మున్సిపల్ కమిషనర్‌ను కలెక్టరేట్‌కు బదిలీ చేశారు. ఆ తర్వాత మళ్లీ ఆయన ఇక్కడకు వచ్చేందుకు విశ్వప్రయత్నాలు చేశారు. కూటమి నేతలు ససేమిరా అన్నారు. దీంతో సొంత శాఖకు పంపించేశారు. వైసీపీ హయాంలో అధికార పార్టీతో అంటకాగి నేతల ధనదాహాన్ని తీర్చిన అధికారులు కూటమి ప్రభుత్వం కొలువు తీరిన తర్వాత అధికారాన్ని వెలగబెట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. నేతల ఆశీస్సులతో మండల, పట్టణ స్థాయిలో అధికారాలను చెలాయించడానికి అడ్డదారులు తొక్కాలని చూశారు. దీంతో ప్రభుత్వమే జోక్యం చేసుకుని అడ్డుకట్ట వేసింది.



కూటమి నేతలకు తలనొప్పి

పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది ఎమ్మెల్యేలు, కూటమి నేతల సిఫారసు లేఖలు తీసుకున్నారు. బదిలీల వ్యవహారం కూటమి నేతలకు కొన్నిచోట్ల తలనొప్పి తెస్తోంది. గ్రామస్థాయిలో నాయకులు మధ్య ఆధిపత్య పోరుతో కార్యదర్శులు, ఇతర ఉద్యోగులపై ఒత్తిడి పెంచుతున్నారు. బదిలీ చేయాలని చూస్తున్నారు. ఒకే గ్రామంలో కొందరు నాయకులు కార్యదర్శులకు సానుకూలంగా, ఇంకొందరు వ్యతిరేకంగా ఉంటున్నారు. తద్వారా నియోజకవర్గ నాయకత్వానికి తలనొప్పులు తెస్తున్నారు. మొత్తంపైన బదిలీల వ్యవహారంలో నేతల సిఫారసులకే పెద్దపీట వేస్తారన్న నమ్మకంతో కొందరు ఉద్యోగులు పైరవీలు చేసుకుంటున్నారు. నేతల ఆశీస్సుల కోసం తహతహలాడుతున్నారు.



జగన్ ప్రభుత్వాన్ని మర్చిపోవడం లేదా ?

ఎమ్మెల్యే నాయకర్ ఆగ్రహం

నరసాపురం, ఆగస్టు 23 : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి మూడు నెలలు పూర్తయినా కొన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో మాజీ సీఎం జగన్ ఫొటోలు ఇప్పటికీ దర్శనమిస్తూనే ఉన్నాయి. ఉన్నతాధికారులు ఎన్ని ఆదేశాలు జారీచేసినా.. సిబ్బంది వాటిని తొలగించడం లేదు. తాజాగా నరసాపురం మండలం కొత్త నవరసపురం సచివాలయంలో ఇదే జరిగింది. శుక్రవారం పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే నాయకర్ సచివాలయం గోడ మీద జగన్ ఫొటోతో కూడిన నవరత్నాల బోర్డు కనిపించడంతో ఆయన మండిపడ్డారు. ఇంకా పాత ప్రభుత్వ జ్ఞాపకాలను మరిచిపోవడం లేదా ? అంటూ ఉద్యోగులపై ఆగ్రహం వ్యక్తం చేసి.. తక్షణం వాటిని తొలగించాలని ఆదేశించారు.

నరకదారి

అధ్వానంగా రహదారులు

ప్రత్తిపాడు-నవాబ్‌పాలెం రోడ్‌పై ప్రయాణం ప్రమాదమే

కోతకు గురైన కేఎస్ గట్టు రోడ్డు.. గాయాలపాలవుతున్న వాహనదారులు

పెంటపాడు/అత్తిలి/పాలకొల్లు అర్బన్, ఆగస్టు 23 : జిల్లాలోని ప్రధాన రహదారులు గోతులతో అధ్వానంగా మారాయి. నిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉండే ఈ రోడ్లు పెద్ద పెద్ద గోతులతో భయానకంగా ఉన్నాయి. పెంటపాడు మండలం ప్రత్తిపాడు నుంచి రాజమండ్రి వెళ్లే రహదారి నిత్యం రద్దీగా ఉంటుంది. నిడదవోలు, రాజమండ్రి వెళ్లే వారికి ఇదే ప్రధాన దారి. ప్రత్తిపాడు నుంచి తాడేపల్లిగూడెం రూరల్ మండలం నవాబ్‌పాలెం వంతెన వరకూ ఈ రోడ్డు ధ్వంసమైంది. ఈ రెండు గ్రామాల మధ్య అడుగు లోతు గోతులు పడ్డాయి. గత వైసీపీ ప్రభుత్వం రహదారుల అభివృద్ధిని గాలికి వదిలేయడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడింది. వర్షం వస్తే గోతులు మొత్తం నీటితో నిండిపోయి గొయ్యి పరిమాణం పెరుగుతోంది. ద్విచక్ర వాహనదారులు వీటిల్లో పడి గాయపడుతున్నారు. ఎన్నికలకు రెండు నెలల ముందు నాసిరకంగా మరమ్మతులు చేసి చేతులు దులుపుకోవడంతో వేసిన రెండు నెలలకే కురిసిన వర్షాలకు మళ్లీ యధా స్థితికి వచ్చింది. ఈ రహదారిపై ప్రయాణం చేయలేక ప్రజలు నరకం చూస్తున్నారు. ప్రత్తిపాడు నుంచి అలంపురం వెళ్లే రోడ్డుదీ ఇదే పరిస్థితి. ప్రత్తిపాడు జంక్షన్ నుంచి జువ్వలపాలెం మీదుగా తాడేపల్లిగూడెం వెళ్లే రహదారి ఇలానే తయారైంది. ప్రభుత్వం మారడంతో ఇకనైనా రహదారులకు మోక్షం లభిస్తుందని ప్రజలు భావిస్తున్నారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో పంత రోడ్ల పరిస్థితి ఏమంతా బాగాలేదు. కనీసం మోటారు సైకిల్, సైకిల్ కూడా వెళ్లే మార్గం లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఏఎంసీ నుంచి పంత రహదారులు అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక రూపొందించి బడ్జెట్‌ను సిద్ధం చేశారు. కార్యాచరణలో విఫలమయ్యారు. ఇటీవల కురిసిన వర్షాలకు మరింత దారుణంగా మారాయి. రావిపాడు నుంచి బెడ్లపాలెం జగనన్న కాలనీకి వెళ్లే పంత రహదారిలో సైకిల్ వేసుకుని వెళ్లేందుకు వీలులేదు. కూటమి ప్రభుత్వంపైనే ప్రజలు, రైతులు ఆశలు పెట్టుకున్నారు.

ఏ రోడ్డు చూసినా.. గోతులమయం

అత్తిలి మండలంలోని రహదారులు అధ్వానస్థితికి చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అత్తిలి నుంచి తణుకు వెళ్లే రహదారిలో కేఎస్ గట్టు రహదారి కోతకు గురికావడంతో వాహన చోదకులు ఆందోళన చెందుతున్నారు. ఒక్కోసారి వాహనదారులు అదుపు తప్పి ప్రమాదాలకు గురవుతున్నారు. నిత్యం ఈ రహదారిపై వేలాది మంది ప్రయాణిస్తుంటారు. దీనికి మరమ్మతులు చేయకపోవడంతో ప్రజలు నరకం చూస్తున్నారు. పాలూరు నుంచి కొమ్మర వెళ్లే దారి అడుగుకొక గొయ్యి పడడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. వర్షం వస్తే గోతుల్లో నీరు నిలిచిపోయి మరింత ప్రమాదకరంగా తయారవుతోంది. గుంటలు, గొప్పులతో నిండి రాళ్ల తేలి రేపు రేఖలు కోల్పోయి కనిపిస్తున్నాయి. ఐదేళ్ల వైసీపీ పాలనలో వీటిని పట్టించుకోకపోవడమే ప్రస్తుత దుస్థితికి కారణం. ప్రస్తుత వర్షాలకు ఇవి మరింత దిగజారాయి. నిత్యం రద్దీగా ఉండే పాలకొల్లు-భీమవరం రోడ్డులో లాకుల వద్ద నుంచి పూలపల్లి సెంటర్ వరకూ 1.5 కిలోమీటర్ల రోడ్డు పలుచోట్ల గోతులమయంగా మారింది. రైలు గేటు వద్ద పరిస్థితి దారుణంగా మారింది. పాలకొల్లు-పామర్రు రోడ్డుపై నిత్యం వేలాది బస్సులు, లారీలు, ట్రాక్టర్లు, ఆటోలు, కార్లతోపాటు బైక్‌లు తిరుగుతాయి. అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతు పనులు చేయించాలని కోరుతున్నారు.


మొగల్తూరు : పెద్ద పెద్ద గోతులతో గొల్లగూడెం-వెంప రోడ్డు


అత్తిలి-రేలంగి మధ్యలో గోతులు పడిన రహదారి


అధ్వానంగా ప్రత్తిపాడు-అలంపురం రహదారి


పాలకొల్లులో గోతుల్లో నిలిచిన వర్షం నీరు

28న సికింద్రాబాద్‌కు ప్రత్యేక రైలు

నరసాపురం ఆగస్టు 23: ప్రయాణికుల రద్దీని పరిగణనలోకి తీసుకుని ఈ నెల 28న నరసాపురం-సికింద్రాబాద్ మధ్య ప్రత్యేక రైలు నడుపుతున్నట్లు స్టేషన్ మేనేజర్ తెలిపారు. 07517 నెంబర్‌తో సాయంత్రం ఆరు గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం ఐదు గంటలకు సికింద్రాబాద్ చేరుతుంది. పాలకొల్లు, భీమవరం టౌన్, ఆకివీడు, కైకలూరు స్టేషన్లలో ఆగుతుంది. గుంటూరు, నల్లగొండ మీదుగా సికింద్రాబాద్ వెళుతుంది.

రైస్ మిల్లర్లు బియ్యం అప్పగించాలి

భీమవరం టౌన్, ఆగస్టు 23 : జిల్లాలోని రైస్ మిల్లర్లు ఈ నెలాఖరులోపు ప్రభుత్వం కేటాయించిన ధాన్యానికి బియ్యాన్ని అప్పగించాలని జేసీ టి.రాహుల్ కుమార్‌రెడ్డి ఆదేశించారు. శుక్రవారం భీమవరం మండలం తాడేరులోని రైస్ మిల్‌కు వెళ్లి మిల్లింగ్ విధానాన్ని, స్టాక్ రిజిస్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ బియ్యం సేకరణను వేగవంతం చెయ్యాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. బియ్యం ఇవ్వాల్సిన మిల్లులను మండలాల వారీగా సమీక్షించారు. వ్యవసాయ శాఖలోని అన్ని పథకాలకు ఈ-పంట నమోదునే ప్రామాణికంగా తీసుకుంటామని తెలిపారు. సివిల్ సప్లై జిల్లా మేనేజరు టి.శివ రామ ప్రసాద్, డీఎస్‌వో ఎన్.సరోజ, ఏఎస్‌వో ఎం.రవిశంకర్, ఏఎస్ఓ టెక్నికల్ మహమ్మద్ ఇబ్రహీం, తదితరులు ఉన్నారు.

రేవు పాటకు ఆరు షెడ్యూళ్ల కొనుగోలు

నరసాపురం, ఆగస్టు 23 : 2024-2025 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మాధవాయిపాలెం రేవు నిర్వహణకు ఐదుగురు పాటదారులు ఆరు షెడ్యూళ్ళను శుక్రవారం కొనుగోలు చేశారు. వీరిలో నరసాపురం శాండ్ క్వారీ బోట్స్ ఫిషర్‌మెన్ సొసైటీ, ది లక్ష్మిపాలెం శాండ్ క్వారీ బోట్స్‌మెన్ సొసైటీ, ది కనకదుర్గ క్వారీ బోట్స్‌మెన్ సొసైటీ, శ్రీ అమరేశ్వర మెరైన్ సొసైటీ, భూపతి మంగయ్యనాయుడు, రౌతుల రఘుబాబు ఉన్నారు. 28న మండల పరిషత్ కార్యాలయంలో వేలం నిర్వహిస్తారు.

విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకోవాలి


డాక్టర్ బీవీ పాపారావును సత్కరిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం అర్బన్, ఆగస్టు 23: విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధనకోసం నిరంతరం కృషి చేయాలని అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లేబోరేటరి డైరెక్టర్, శాస్త్ర వేత్త డాక్టర్ బీవీ పాపా రావు అన్నారు. ఏపీ నిట్ బీటెక్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలు పొందిన 455 మంది విద్యార్థులకు వారం రోజులుగా నిర్వహిస్తున్న ఇండక్షన్ ప్రోగ్రాం శుక్రవారంతో ముగిసింది. కార్యక్రమానికి హాజరైన డాక్టర్ పాపారావు మాట్లాడుతూ పరిశోధనలలో కొత్త శిఖరాలను అధిరోహించడం అత్యంత అవసరమన్నారు. రక్షణ, పరిశోధన రంగంలో భారత్ స్వావలంబన సాధించి ప్రపంచానికే స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు. చదువుకుంటున్న సమయంలో తాత్కాలిక ఆనందాలకు లొంగిపోతే భవిష్యత్ అంధకారమవుతుందన్నారు. ఏపీ నిట్ రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్‌శంకర్‌రెడ్డి మాట్లాడుతూ ఏ వృత్తిలో అయినా రాణించాలంటే ఆధునిక సాంకేతికతపై పట్టు సాధించాలన్నారు. అనంతరం డాక్టర్ పాపారావును సత్కరించారు. తొలుత అంతరిక్ష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.

టాయిలెట్ల ఫొటోలకు హెచ్‌ఎంలపై ఒత్తిడి వద్దు

ఏలూరు అర్బన్, ఆగస్టు 23 : పాఠశాలల్లో టాయిలెట్ల ఫొటోలను తీసే బాధ్యతల నుంచి స్కూలు ఉపాధ్యాయులను తప్పిస్తూ కూటమి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ హెచ్‌ఎంలపై ఇప్పటికీ విద్యాశాఖ ఒత్తిళ్ళు తప్పడంలేదని ఏపీటీఎఫ్ 1938 జిల్లా నాయకులు రత్నంబాబు, మోహనరావు ఓ ప్రకటనలో ఆరోపించారు. టాయిలెట్ల ఫొటోలను తీసి నిర్ణీత యాప్‌లో అప్‌లోడ్‌చేసే బాధ్యతలను వారానికి చెరో రెండురోజులపాటు సచివాలయ ఎడ్యుకేషన్ వెల్ఫేర్ అసిస్టెంట్, ఎస్‌ఎంసీ చైర్మన్‌కు అప్పగించిందన్నారు. ప్రతీరోజు మధ్యాహ్నం 3గంటల నుంచి 3.30 గంటల్లోగా హెచ్‌ఎంలు తనిఖీలు చేసి నివేదికను సమర్పించాలని విద్యాశాఖ ఉత్తర్వులివ్వడంతో మళ్ళీ హెచ్‌ఎం పరిస్థితి ఆందోళనకరంగా మారిందన్నారు. ఎడ్యుకేషన్ వెల్ఫేర్ అసిస్టెంట్, ఎస్‌ఎంసీ చైర్మన్ ఫొటోలు తీయకపోయినా ఆ ఒత్తిడి స్కూల్ హెచ్‌ఎంలపై పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

కష్టించే కార్యకర్తలకు గుర్తింపు

కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ


కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మను సత్కరిస్తున్న కళాశాల యాజమాన్యం

నరసాపురం రూరల్, ఆగస్టు 23: బీజేపీని పార్టీ శ్రేణులు మరింత బలో పేతం చేసేందుకు కృషి చేయాలని కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాస వర్మ పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన పార్టీ శ్రేణుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. కేంద్రం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. అప్పుడే పార్టీపై నమ్మకం ఏర్పడుతుందన్నారు. కష్టించి పని చేసే కార్యకర్తలకు గుర్తింపు ఉంటుందన్నారు. ఎన్నికల్లో విజయానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం శ్రీనివాసవర్మను కళాశాల యాజమాన్యం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో చైర్మన్ కె.సత్య నారాయణ, కె.త్రినాద్, అడ్డాల శ్రీహరి, బీజేపీ రాష్ట్ర నాయకులు పాకా సత్య నారాయణ, నారిన తాతాజీ, మేకల సతీష్, పీవీఆర్, ఉన్నమట్ల కబర్ధి, ఎం వెంకటేశ్వరావు పాల్గొన్నారు


వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

ప్రభుత్వ వైద్యం పేదలకు చేరువవ్వాలి: కలెక్టర్

పాలకొల్లు రూరల్, ఆగస్టు 23: ప్రభుత్వ వైద్యం పేదలకు చేరువగా ఉండేలా వైద్య సిబ్బంది సేవలందించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో రోగులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు. ప్రసూతి, జనరల్ వార్డు తదితర విభాగాలను పరిశీలించారు. ఆసుపత్రిలో మౌలిక సదుపాయాల గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఓపీ, ప్రసవాలు, జ్వరాల కేసులు వివరాలను వైద్యులు జిల్లా కలెక్టర్‌కు వివరించారు. జిల్లా కలెక్టర్ వెంట ఆర్డీవో ఎం.అచ్యుత్ అంబరీష్, తహసీల్దారు దుర్గాకిషోర్ ఉన్నారు.

ఆధునిక పద్ధతుల్లో చేపల సాగు చేయాలి

నరసాపురం రూరల్ ఆగస్టు 23: మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఆధునిక పద్ధతిలో చేపల సాగు చేస్తే ఖర్చు తగ్గడంతో పాటు అధిక దిగుబడిని సాధించవచ్చునని జిల్లా మత్స్యశాఖ డీఎఫ్‌వో ఆర్‌వీఎస్‌వీ ప్రసాద్ అన్నారు. శుక్రవారం అంబేడ్కర్ భవనంలో మత్స్యశాఖ, ఎంపెడాల ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. సాగులో రైతులు మెళకువలను తెలుసుకోవాలన్నారు. వైరస్‌లు సోకినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన ఉండాలన్నారు. అయితే వర్షం కారణంగా సదస్సుకు పెద్ద సంఖ్యలో రైతులు హాజరుకాలేకపోయారు. ఉన్న కొద్ది మందితోనే ముగించారు. ఈ కార్యక్రమంలో ఎడీఎఫ్ ఆనందకుమార్, ఎఫ్‌డీవో ఎల్‌ఎల్ రాజు, పాల్గొన్నారు

సేవ అనే పదానికి స్ఫూర్తి చిరంజీవి

భీమవరం టౌన్, ఆగస్టు 23 : సేవ అనే పదానికి స్ఫూర్తి మెగాస్టార్ చిరంజీవి అని, ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు చిరంజీవి కుటుంబం చేసే దాతృత్వం స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు వేడుకలను పట్టణ జనసేన ఆధ్వర్యంలో నిర్వహించారు. జనసేన పట్టణ అధ్యక్షుడు చెనమల్ల చంద్రశేఖర్, బండి రమేష్ కుమార్, మండల అధ్యక్షుడు మోకా శ్రీనివాస్, హరి, కృష్ణ, శ్రీను, నీలేంద్ర, బన్ను ప్రసాద్, చెన్నూరవి, వీర మహిళలు శ్యామల, మీనా, నాయకులు పాల్గొన్నారు.

ప్రతిభకు పురస్కారం

ఎన్‌ఎంఎంఎస్



• విజేతలకు ఐదేళ్ల చదువుకు స్కాలర్‌షిప్ • సంవత్సరానికి 12వేలు చొప్పున మొత్తం 60వేల స్కాలర్‌షిప్ • దరఖాస్తుకు ఆఖరు తేదీ సెప్టెంబరు 6 • పరీక్ష తేదీ డిసెంబరు 8

నిడమర్రు ఆగస్టు 23 : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల కోసం కేంద్ర ప్రభుత్వం నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కీమ్ (ఎన్‌ఎంఎంఎస్) పథకాన్ని 2008లో ప్రారంభించింది. పరీక్ష రాయడానికి కేవలం ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 8వ తరగతి విద్యార్థులు మాత్రమే అర్హులు. ఈ పరీక్షలో విజేతలుగా నిలిచినవారికి తొమ్మిదవ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ఏటా 12 వేల రూపాయలు ఉపకార వేతనాన్ని కేంద్ర ప్రభుత్వం అందిస్తోంది.

ఎన్‌ఎంఎంఎస్ పరీక్షకు అర్హతలు

- రాష్ట్రంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్, మునిసిపల్, ఎయిడెడ్, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలు, వసతి సౌకర్యం లేని ఆదర్శ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు
- ఏడో తరగతిలో 55% మార్కులు సాధించిన విద్యార్థులు పరీక్ష రాయడానికి అర్హులు. తుది ఎంపిక సమయం నాటికి ఎనిమిదో తరగతిలో 55% మార్కులు పొంది ఉండాలి.
- అభ్యర్థి కుటుంబ వార్షిక ఆదాయం సంవత్సరానికి రూ.3లక్షల 50 వేల లోపు ఉన్న విద్యార్థులు మాత్రమే అర్హులు.

పరీక్షా విధానం

ప్రతిభావంతులను ఎంపిక చేయడానికి రాతపరీక్షను నిర్వహిస్తారు. దీనిలో రెండు విభాగాలలో పరీక్ష రాయాల్సి ఉంటుంది.

ఎ. మ్యాట్ (మెంటల్ ఎబిలిటీ టెస్టు)

దీనిలో 90 మల్టీపుల్ చాయిస్ ప్రశ్నలు ఉంటాయి. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు ఉంటుంది. నెగిటివ్ మార్కింగ్ లేదు. దీనిలో విద్యార్థిలోని రీజనింగ్ నైపుణ్యాలను పరీక్షిస్తారు.

బి. శాట్ (స్కాలషిప్ అప్టిట్యూడ్ టెస్టు)

ఈ విభాగంలో 90 మల్టీపుల్ చాయిస్ ప్రశ్నలు ఉంటాయి. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు కేటాయించబడుతుంది. నెగెటివ్ మార్కింగ్ లేదు. 7,8 తరగతులలో గణితం, సైన్స్, సోషల్ లకు సంబంధించిన ప్రశ్నలు ఉంటాయి.

పరీక్ష ఫీజు

ప్రతి విద్యార్థి పరీక్ష ఫీజు రూ.100 చెల్లించాలి. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు 50 రూపాయల ఫీజు చెల్లించాలి.

రిజర్వేషన్ విధానం

ఎస్‌సీ - 15%, ఎస్‌టి- 6%, బీసీ ఎ- 7% , బీసీ బీ - 10% , బీసీ సీ - 1%, బీసీ-డీ 7%, బీసీ ఈ 4%, పీహెచ్- 3% ప్రాతిపదిక స్కాలర్‌షిప్‌కు విద్యార్థులను ఎంపిక చేయబడతారు.

ముఖ్యమైన తేదీలు

దరఖాస్తులు ఆన్‌లైన వెబ్‌సైట్‌లో ఆగస్టు 8 నుంచి స్వీకరిస్తున్నారు. దరఖాస్తు చేయడానికి సెప్టెంబరు 6వ తేదీ చివరి తేదీ. పరీక్ష రుసుము ఆన్‌లైన్ ద్వారా ఎస్.బి.ఐ. లింక్ ద్వారా మాత్రమే చెల్లించాలి. పరీక్ష తేదీ 8 డిసెంబరు, 2024.

విద్యార్థి భవిష్యత్‌కు ఉపయుక్తం

• కె. సుబ్బరాజు గ్రైడ్ టీచర్, ఉన్నత పాఠశాల ఫత్తేపురం



ఎన్‌ఎంఎంఎస్ అనేది ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఒక వరం. ఎనిమిదో తరగతి నుంచే విద్యార్థులలో పోటీ పరీక్షలకు సంబంధించిన నైపుణ్యాలు పెంచడానికి ఈ పరీక్ష దోహదపడుతుంది. మెంటల్ ఎబిలిటీ కూడా ఈ పరీక్ష కోసం విద్యార్థి నేర్చుకోవల్సిన ఉండడంతో విద్యార్థి భవిష్యత్‌లో ప్రభుత్వ ఉద్యోగం సాధించడానికి ఈ ప్రిపరేషన్ ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది.

ఈ పరీక్షతో ఆత్మవిశ్వాసం పెరిగింది

• లింగంపల్లి జయరామ్



నేను ప్రాథమిక విద్య నుంచి ఎంటెక్ ఐఐటీ రూర్కీ వరకు ప్రభుత్వ విద్యను అభ్యసించాను. ప్రస్తుతం హైదరాబాద్‌లో ఓ ప్రముఖ సంస్థలో డిజిటల్ డిజైన్ ఇంజనీర్ గా పనిచేస్తున్నాను. ఈ పయనంలో ఎన్నో పోటీ పరీక్షలు ఎదుర్కొన్నాను. నా విద్యార్థి జీవితంలో నేను ఎదుర్కొన్న మొట్టమొదటి పరీక్ష ఎన్.ఎం.ఎం.ఎస్ పరీక్ష. 2013లో పెదనిండ్రకొలను ఉన్నత పాఠశాలలో 8 వతరగతి చదువుతున్నప్పుడు రాసిన ఎన్.ఎం.ఎం.ఎస్ పరీక్షలో విజేతగా నిలవడంతో ఆత్మ విశ్వాసం పెరిగింది. ఈ ఆత్మవిశ్వాసం నా గమ్యం దిశగా నడిపించింది.

భవిష్యత్ విద్యపై భరోసా కలిగింది

• కవల రిషిత, ఎంపీయూపీ స్కూల్, జల్లికొమ్మర



నేను గణపవరం మండలం జల్లికొమ్మర ప్రాథమికోన్నత పాఠశాలలో గత సంవత్సరం 8 వతరగతి చదువుతూ ఎన్.ఎం.ఎం.ఎస్ పరీక్షలకు ప్రిపేరయ్యాను. ఈ పరీక్ష ద్వారా తొలిసారి రీజనింగ్, అర్థమేటిక్ అంశాలతో పరిచయం ఏర్పడింది. రీజనింగ్ ద్వారా తార్కిక జ్ఞానం పెంపొందించుకోవచ్చు. పరీక్షలో విజేతగా నిలిచిన నాకు ఆత్మవిశ్వాసం పెరిగింది. భవిష్యత్తు విద్యాభ్యాసంపై నమ్మకం కలిగింది.

ముగుస్తున్న శ్రావణం

» నాలుగు రోజుల్లో శుభ కార్యాలకు ఫుల్‌స్టాప్
» మళ్ళీ అక్టోబర్ 6 నుంచి డిసెంబరు 28 వరకు ముహూర్తాలు
» శ్రావణంలో భారీగా వివాహాలు



భీమవరం టౌన్, ఆగస్టు 23 : మరో నాలుగు రోజుల్లో శుభకార్యాలకు నెల రోజులపాటు ఫుల్ స్టాప్ పడనుంది. శూన్య మాసం వల్ల శుభకార్యాలు ఉండవు. తిరిగి అక్టోబరు 6వ తేదీ నుంచి డిసెంబరు 28 వ తేదీ వరకు శుభకార్యాలకు అనుకూలంగా ఉంది. గత ఏప్రిల్ 30వ తేదీ నుంచి గురుమూఢం ప్రారంభం కావటంతో అప్పటి నుంచి శుభకార్యాయాలు నిలిచిపోయాయి. దీంతోపాటుగా మే 17నుంచి జూన్ 14 వరకు శుక్రమూఢం కావటంతోను, వెంటనే ఆషాడ మాసం కూడా కలసి రావటంతో దాదాపు 3నెలలపాటు శుభకార్యాలు నిలచిపోయాయి. దీంతో అన్ని వర్గాల వారు కొంత ఇబ్బందులు పడ్డారు. ఆగస్టు5వ తేదీనుంచి శ్రావణమాసం ప్రారంభం కావటంతో శుభకార్యాలకు శ్రీకారం చుట్టారు. గతంలో మూడు నెలలు లేకపోవటంతో శ్రావణ మాసం శుభకార్యాల సందడి నెలకొంది. బంగారం, వస్త్రదుకాణాలు, ఇలా అన్ని షాపులు కళకళలాడాయి. దీంతో పాటుగా శుభముహూర్తాలు కూడా బలంగా ఉండటంతో ఈనెల 9,15,16,17, 19, 22,23 తేదీలతో పాటుగా 26, 28 తేదీల ముహూర్తాలు బలంగా ఉండటంతో భారీగా వివాహలు, గృహప్రవేశాలు, శంకుస్థాపనలు ఇలా అన్ని రకాల శుభకార్యాలు ఘనంగా చేసుకున్నారు. అయితే వర్షాకాలం కావటంతో కొంత ఇబ్బందులు కలిగినా ప్రస్తుతం ఇంటి వద్దకాకుండా కల్యాణ మండపాలల్లో నిర్వహించుకోవటంతో ఇబ్బందులు తక్కువగానే ఉన్నాయి మధ్యలో ఎండల తీవ్రత ఎక్కువగా ఉండటంతో బంధువులు, ప్రజలు ఇబ్బందులు పడ్డారు. మళ్లీ అక్టోబరు నుంచి బాజా భజంత్రీలు మోగనున్నాయి.



డ్రెయిన్ తవ్వుతున్న ఎక్స్‌కవేటర్ వద్ద ఎమ్మెల్యే ఫ్లెక్సీకి పాలాభిషేకం చేసిన రైతులు

ఎట్టకేలకు బీదరుకోడు ప్రక్షాళన

» 15 సంవత్సరాల తరువాత తవ్వకం
» ఎమ్మెల్యే రఘురామ ఫొటోకు పాలాభిషేకం

ఆకివీడు రూరల్ ఆగస్టు 23 : సంవత్సరాల తరబడి రైతుల నిరీక్షణ.. కాళ్ళరిగేలా అధికారులు, ప్రజాప్రతినిధులు చుట్టూ తిరిగినా ఫలితం లేదు. కొద్దిపాటి వరద వచ్చినా బీదరుకోడు పొంగి పొలాలు ముంపుబారిన పడి తీవ్రంగా నష్టపోతున్న రైతన్న ఆవేదన ఇన్నాళ్ళకు కార్యరూపం దాల్చింది. తెలుగుదేశం పార్టీ కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత డ్రెయిన్ త్రవ్వకం పనులు ప్రారంభించారు. ఆకివీడు, గణపవరం, నిడమర్రు, ఉంగుటూరు మండలాలకు చెందిన వరద నీటిని కొల్లేరులోని బీదరుకోడు డ్రెయిన్ ఉప్పుటేరు ద్వారా సముద్రంలోకి తీసుకెళుతుంది. ఈమండలాల్లోని ఆయకట్టు దీనిపై ఆధారపడి ఉంది. ప్రతియేటా వర్షాకాలంలో ఈకోడును తలుచుకొని రైతులుండరు. 15 సంవత్సరాలుగా ఈకాలువ కిక్కసతో నిండిపోవడంతో రైతులు ఇబ్బంది పడ్డారు. అయితే ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు చొరవతో కొల్లేరులోని బీదరుకోడు డ్రెయిన్ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయని రైతులు తెలిపారు. ఏళ్ళ తరబడి ఉన్న సమస్య తీరనున్నదని ఆనందం వ్యక్తం చేశారు. ఈసమస్య పరిష్కారానికి కృషి చేసిన ఎమ్మెల్యే చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు.

ఎమ్మెల్యే ఫొటో లేకపోవడంపై ఆగ్రహం

ఆకివీడు రూరల్ ఆగస్టు 23: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన గ్రామసభల కార్యక్రమం సందర్భంగా గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలలో స్థానిక ఎమ్మెల్యే ఫొటో లేకపోవడంతో అధికారుల తీరుపై అధికార పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు భగ్గుమన్నారు. అధికారులకు ముందుగానే తెలియజేసినప్పటికి ఫొటో పెట్టకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయమై ప్రతి గ్రామంలో జరిగిన గ్రామసభలో అధికారులను నిలదీశారు. అధికారులు తమ తీరును మార్చుకోవాలని సూచించారు.



మాట్లాడుతున్న ఏఆర్ అదనపు ఎస్పీ ఎస్ఎస్ఎస్ శేఖర్

పొదుపుతో భవిష్యత్‌కు భరోసా

ఏలూరు క్రైం, ఆగస్టు 23 : భావితరాల అవసరాల కోసం తమ పిల్లల భవిష్యత్తు దృష్టిలో పెట్టుకుని ప్రతి ఒక్కరు పొదుపు చేసుకోవాలని జిల్లా ఆర్మ్డు రిజర్వు అదనపు ఎస్పీ ఎస్ఎస్ఎస్ శేఖర్ అన్నారు. ఏలూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఏఆర్ సిబ్బంది, హోంగార్డులతో శుక్రవారం ఉదయం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న ఏఆర్ అదనపు ఎస్పీ శేఖర్ మాట్లాడుతూ మానవునికి ఆర్థికంగా ఎన్నో ఇబ్బందులు ఎదురవుతుంటాయని వాటన్నింటిని సమతుల్యతతో సరిదిద్దుకోవాలంటే ఖచ్చితంగా పొదుపు చేసుకోవాలన్నారు. సిబ్బంది టాక్స్ సేవింగ్స్, ఇన్వెస్ట్‌మెంట్ స్కీములపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. బరోడా బ్యాంక్ సీనియర్ మేనేజర్ సురేష్, అసిస్టెంట్ మేనేజర్ భరత్‌కుమార్‌లు సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎఆర్ డీఎస్పీ శ్రీహరిరావు, ఆర్ఐ పవన్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు జేఏసీ, రెవెన్యూ ఉద్యోగుల సమావేశాలు

ఏలూరు అర్బన్, ఆగస్టు 23 : ఏపీజేఏసీ-అమరావతి రాష్ట్ర కార్యవర్గ సమావేశం, ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశాలను ఈ నెల 25న ఏలూరులోని రెవెన్యూ భవన్‌లో నిర్వహిస్తున్నట్టు సంఘ ఏలూరు జిల్లా చైర్మన్ కె.రమేష్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని 26 జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు, సభ్య సంఘాల నాయకులు పాల్గొంటారని వివరించారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



ఉంగుటూరు, ఆగస్టు 23: జాతీయ రహదారిపై చేబ్రోలు వద్ద శుక్రవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇరువురు గాయపడ్డారు. హైవే పెట్రోలింగ్ సిబ్బంది కథనం ప్రకారం.. చేబ్రోలు గేటు లోంచి ఏలూరు వైపు మోటారు సైకిల్ వేగంగా వెళుతుండగా తణుకు నుంచి ఏలూరు వైపు వెళుతున్న కారు మోటార్ సైకిల్‌ను తప్పించబోయి బస్ షెల్టర్‌ను ఢీకొనడంతో దాని ఇనుప స్తంభం విరిగి పోయింది. అదే సమయంలో మోటారు సైకిల్, కారు పక్కనే ఉన్న గోతిలోకి వెళ్లి పోయాయి. కాగా బస్ షెల్టర్‌లో ఉన్న బల్లు అన్నపూర్ణకు ఎడమ కాలుకు తీవ్రగాయమైంది. జలుమూరి ఉదయ కిరణ్ (గోపీనాధపట్నం)కు స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన వారిని తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

క్షతగాత్రులకు డాక్టర్ సేవలు


క్షతగాత్రుడికి బ్రీతింగ్ చికిత్స చేస్తున్న డాక్టర్ నార్నీ భావాజీ

పెంటపాడు, ఆగస్టు 23: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తికి తాడేపల్లిగూడేనికి చెందిన వైద్యుడు డాక్టర్ నారీ భావాజీ సత్వర చికిత్స అందించారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బెంగాల్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులు తాడేపల్లిగూడెంలో బంగారం పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరిద్దరూ శుక్రవారం అలంపురం జాతీయ రహదారి పక్కన గాయాలతో పడి ఉండగా అటుగా కుటుంబంతో కారులో వెళ్తున్న డాక్టర్ నార్నీ భావాజీ గమనించారు. వీరిలో గోల్డ్ స్మిత్ అనే వ్యక్తికి తీవ్ర గాయాలై బ్రీతింగ్ కూడా ఇబ్బంది గా మారడంతో తక్షణం స్పందించిన భావాజీ అతనికి బ్రీతింగ్ చికిత్స చేసి అంబులెన్స్‌పై తణుకు ఆసుపత్రికి తరలించారు. డాక్టర్ భావాజీ స్పందించిన తీరుకు స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. కాగా ప్రమాదం జరగడానికి కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది.

కుటుంబ కలహాలతో ఆత్మహత్య

మొగల్తూరు, ఆగస్టు 23: వ్యసనాలకు బానిసై ఒక వ్యక్తి ఆతర్వాత కుటుంబ కలహాలతో ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ జి.వాసు కథనం ప్రకారం.. కెపిపాలెం నార్త్ గ్రామానికి చెందిన కారేపల్లి కిరణ్ (32) మద్యానికి బానిసగా మారి భార్యతో తరచూ గొడవలు పడుతున్నాడు. ఈనేపథ్యంలో గురువారం రాత్రి మద్యం సేవించి ఇంటికి వచ్చాడు. భార్య భర్త మధ్య వివాదాలు తలెత్తడంతో ఇంటి నుంచి బయటకు వెళ్ళిన కిరణ్ మామిడి చెట్టుకు ఉరివేసుకుని మృతి చెందాడు. మృతుని భార్య చిన్నారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. మృతునికి 9, 7 సంవత్సరాలు ఇద్దరు కుమారులు ఉన్నారు.

లారీ ఢీకొని ఇద్దరికి గాయాలు

కాళ్ళ ఆగస్టు 23 : లారీ ఢీకొని ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. కాళ్ళ ఎస్ఐ ఎస్.శ్రీనివాసరావు తెలిపిన వివరాలు ప్రకారం.. దొడ్డనపూడి గ్రామానికి చెందిన పోతురాజు ఇస్మాయిల్, తెనాలి అబ్రహంలు ద్విచక్ర వాహనంపై 22వ తేదీ దొడ్డనపూడి నుంచి కాళ్ళ గ్రామం వెళుతుండగా పాత ఇనుప సామాను కొట్టు వద్దకు వచ్చేసరికి ఎదురుగా రాంగ్ రూట్లో వస్తున్న లారీ ఢీకొన్నది. ఈ ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వీరు భీమవరం పట్టణంలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం చేరారు. ఆసుపత్రిలో బాధితుడు ఇస్మాయిల్ ఇచ్చిన స్టేట్‌మెంట్ మేరకు శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న మరో లారీ: డ్రైవర్ మృతి

పెదపాడు, ఆగస్టు 23 : ఆగి వున్న లారీని వెనుక నుంచి మరో లారీ ఢీకొన్న ఘటనలో లారీ డ్రైవర్ మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. ప్రకాశం జిల్లా సంగాపురం మండలం, వీరపల్లి గ్రామానికి చెందిన భీమినేని నరేష్ లారీలో రాజమండ్రి నుంచి విజయవాడ వైపు వెళుతున్నాడు. మార్గంమధ్యలో గురువారం రాత్రి పెదపాడు మండలం కలపర్రు జాతీయరహదారిపై సాయిబాబా దేవాలయం వద్ద మరమ్మతు నిమిత్తం రోడ్డు పక్కన ఆగి వున్న మరో లారీని వెనుక నుంచి ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో నరేష్ తీవ్ర గాయాలతో లారీక్యాబిన్‌లో ఇరుక్కుపోగా, హైవే అంబులెన్స్, పోలీసులు అతి కష్టం మీద లారీడ్రైవర్‌ను క్యాబిన్‌లో నుంచి బయటకు తీసి ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందాడు. మృతుడి తండ్రి వెంకటేశ్వర్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై కె.శుభశేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భార్య మెడకోసిన భర్తకు రిమాండ్

ఏలూరు క్రైం, ఆగస్టు 23 : భార్యపై అనుమానంతో బ్లేడుతో మెడ కోసిన భర్తను ఏలూరు రూరల్ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం దెందులూరు మండలం చల్లపల్లికి చెందిన ఎడ్లపల్లి రవికుమార్ పది సంవత్సరాల క్రితం ఏలూరులోని లునానీనగర్‌కు చెందిన హేమలత (32)ను ప్రేమించి పెళ్ళి చేసుకున్నాడు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆమెపై తరచు అనుమానం పడుతూ వేధించడంతో ఆమె కొంత కాలం క్రితం తన పుట్టింటికి లునానీనగర్‌కు వెళ్ళిపోయింది. ఈనెల 21వ తేదీ అర్ధరాత్రి రవికుమార్ ఆమె వద్దకు వెళ్ళి ఆమె మెడను బ్లేడుతో కోసేశాడు. తీవ్ర గాయాలకు గురైన ఆమె ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతుంది. రవికుమార్ పై హత్యాయత్న కేసును ఏలూరు రూరల్ పోలీసులు నమోదు చేశారు. అతనిని శుక్రవారం అరెస్టు చేసి కోర్టుకు హాజరుపర్చగా 14రోజులు రిమాండ్ విధించారు.

నాలుగు ఫోన్లు రికవరీ

భీమవరం క్రైం, ఆగస్టు 23 : భీమవరం రైల్వే పోలీస్‌స్టేషన్ (జీఆర్‌పీ) పరిధిలో జరిగిన మొబైల్ మిస్సింగ్ కేసుల్లో సీఈఐఆర్ యాప్ ద్వారా భీమవరం జీఆర్‌పీ పోలీస్‌లు నాలుగు మొబైల్ ఫోన్లను రికవరీ చేసి ఫిర్యాదుదారులకు శుక్రవారం భీమవరం జీఆర్‌పీ ఎస్ఐ పీటీవీ రమణ అందజేశారు.

మోటారు సైకిళ్ల దొంగలు అరెస్టు


నిందితులను అరెస్టు చేసిన పోలీసులు

తాడేపల్లిగూడెం రూరల్, ఆగస్టు 23: తాడేపల్లిగూడెం సర్కిల్ పోలీసులు ఇద్దరిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.3.85లక్షల విలువ చేసే మోటారుసైకిల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. పట్టణ సీఐ సుబ్రహ్మణ్యం తెలిపిన వివరాలు ప్రకారం.. తాడేపల్లిగూడెం, పట్టణం, దేవరపల్లి, గోపాలపురం, నిడదవోలు, ఏలూరు, కోరుకొండ ప్రాంతాల్లో జరుగుతున్న చోరీలపై పోలీసులు నిఘా పెట్టారు. ఈ దర్యాప్తులో భాగంగా తాడేపల్లిగూడెంలోని మిర్చి దాబా వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న నిందితులను అదుపులోకి తీసుకుని విచారించగా నల్లజర్ల మండలం ప్రకాశరావుపాలెంకు చెందిన పూలపల్లి శివసుబ్రహ్మణ్యం, తాడేపల్లిగూడెం జువ్వలపాలెంకు చెందిన మరపట్ల రాజ్‌కుమార్‌లు నేరం అంగికరించి వారు చోరీ చేసిన 8 మోటారుసైకిల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ దర్యాప్తులో కీలకంగా వ్యవహరించిన సీఐ సుబ్రహ్మణ్యం, ఎస్సై నాగరాజు, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

నలుగురు దారి దోపిడీ దొంగల అరెస్టు

భీమవరం క్రైం, ఆగస్టు 23 : దారిదోపిడీకి పాల్పడ్డ నలుగురిని శుక్రవారం అరెస్టు చేసినట్లు జిల్లా అడిషనల్ ఎస్పీ వి.భీమారావు తెలిపారు. శుక్రవారం టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. కాళ్ళ మండలం కోపల్లె గ్రామానికి చెందిన కోన రమేష్ ఈనెల 22వ తేదీ రాత్రి సుమారు ఒంటి గంట ప్రాంతంలో ఒక వివాహ వేడుకలో ఫొటోలు తీసి ఇంటికి వెళుతున్నాడు. మార్గంమధ్యలో చినఅమిరం గ్రామం అంబేడ్కర్ సెంటర్ వద్దకు వెళ్ళేసరికి నలుగురు యువకులు రమేష్ వాహనాన్ని ఆపారు. జేబులో ఉన్న సొమ్ము ఇమ్మని లేనిపక్షంలో చంపుతామంటూ కత్తితో బెదిరించి కొట్టారు. అనంతరం అతని జేబులో ఉన్న ఐదువేల రూపాయల పర్సుని లాక్కుని వెళ్ళిపోయారు. దీనిపై రమేష్ శుక్రవారం టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సీసీ ఫుటేజీ ఆధారంగా చినఅమిరం గ్రామానికి చెందిన కొడాలి సతీష్, బిరుదగడ్డ నరేష్, గూడపాటి ఉదయ్‌కుమార్, తెనాలి దావీద్‌లను శుక్రవారం మధ్యాహ్నం భీమవరం హాస్పిటల్స్ వెనుక రోడ్డులో అరెస్టు చేసినట్లు తెలిపారు. కొడాలి సతీష్‌పై ఒక హత్య కేసు కూడా ఉంది. గూడపాటి ఉదయ్‌కుమార్‌పై రెండు కేసులు, తెనాలి దావీదుపై రెండు కేసులు ఉన్నట్లు తెలిపారు. అరెస్టు చేసిన నలుగురిపై రౌడీషీట్లు ఓపెన్ చేస్తామని తెలిపారు. నిందితులను అరెస్టు చేసిన సీఐ కాళీచరణ్, ఎస్ఐ రహ్మాన్, సిబ్బందికి రివార్డు అందిస్తామని తెలిపారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

భీమవరం క్రైం, ఆగస్టు 23 : రెండు రోజులు క్రితం భీమవరం మండలం రాయలం గ్రామంలో ఒక మహిళను మోసం చేసి మెరుగుపెడతామంటూ ద్రావకంలో బంగారం వేసి దోచుకెళ్ళిన బీహార్ రాష్ట్రానికి చెందిన ఏడుగురు సభ్యుల ముఠాను అరెస్టు చేసినట్టు అడిషనల్ ఎస్పీ వి.భీమారావు తెలిపారు. ఇటీవల ఇలాంటి నేరాలు, సైబర్ నేరాలు బాగా పెరిగాయని వాటిపై ప్రజలకు అవగాహన ఎంతైనా అవసరం అని అన్నారు. మనది కాని వస్తువు కోసం ఆశపడటం చాలా తప్పని మనం కష్టపడి సంపాదించుకోవాలే తప్ప ఇతరుల వస్తువులు, డబ్బుపై ఆశపెట్టుకోవడం దురాశ దుఃఖానికి చేటు అన్నారు. ఈ సమావేశంలో టూటౌన్ సీఐ జి కాళీచరణ్, ఎస్ఐ ఎఫ్ రహ్మాన్, తదితరులు పాల్గొన్నారు.



నరసాపురంలో న్యాయవాదుల నిరసన

'హత్యాచారం నిందితులను శిక్షించాలి'

నరసాపురం టౌన్/భీమవరం టౌన్/తణుకు, ఆగస్టు 23: కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై హత్యాచారం ఘటనను నిరసిస్తూ నరసాపురంలో శుక్రవారం న్యాయవాదులు విధులు బహిష్కరించి ఆందోళన చేపట్టారు. కోర్టు ప్రాంగణం నుంచి అంబేడ్కర్ సెంటర్ వరకు నిరసన ప్రదర్శన చేశారు. నిందితులను కఠినంగా శిక్షించాలని, ఇలాంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా చట్టాల్లో మార్పులు తీసుకురావాలన్నారు. వీరి ఆందోళనకు ఎమ్మెల్యే నాయకర్ మద్దతు పలికి న్యాయవాదులతో కలిసి నిరసన తెలిపారు. చేగొండి బాలాజీ, పుల్లాజీ, కొత్తపల్లి రమేష్, ప్రగతి, పురేళ్ళ శ్రీనివాస్, సోమశేఖర్, అన్నపూర్ణ, శిరీష, రంజిత్‌కుమార్, ఫణికర్, సుభాష్, వి.శ్రీను పాల్గొన్నారు.

● భీమవరం డీఎన్నార్ ఎన్‌ఎస్‌ఎస్, ఎన్‌సీసీ యూనిట్, శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో కోల్‌కతాలో మహిళా వైద్యురాలి హత్యపై నిరసన ర్యాలీ నిర్వహించారు. కళాశాల వైస్ ప్రెసిడెంట్ గోకరాజు పాండురంగరాజు మాట్లాడుతూ డాక్టర్‌పై అత్యాచారం అత్యంత దారుణమన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ జి.మోజెస్, ఎన్‌ఎస్‌ఎస్ మేజర్ ఎ.వీరయ్య మాట్లాడుతూ సమాజంలో మహిళలను గౌరవించినప్పుడే మన భారతీయులకు సార్థకత చేకూరుతుందన్నారు. అనంతరం నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడారు. ఎన్‌ఎస్‌ఎస్ ఆఫీసర్ కె.సోమయ్య, జి.లక్ష్మీభవాని పాల్గొన్నారు.

● మహిళలకు రక్షణ కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పీవీ ప్రతాప్ విమర్శించారు. శుక్రవారం తణుకు పట్టణంలో సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. రోడ్డుమీద పట్టపగలే వెళ్ళడానికి భయపడే పరిస్థితులు ఉండటం ఆందోళన కలిగిస్తుందన్నారు. యూనియన్ నాయకులు గార రంగారావు, ఆదినారాయణ, అనంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

యోగా, ధ్యానంతో ఒత్తిడి దూరం

గణపవరం, ఆగస్టు 23: యోగా, ధ్యానం తదితర వ్యాయామాల ద్వారా ఒత్తిడిని అధిగమించాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నిర్మలకుమారి అన్నారు. శుక్రవారం చింతలపాటి మూర్తిరాజు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు మానసిక ఒత్తిడిపై అవగాహన సదస్సు నిర్వహించారు. మచిలీపట్నం ప్రభుత్వ ఆసుపత్రి సైకాలజీ, సైకోథెరపిస్ట్ డాక్టర్ అనుకొండ అనంతకుమార్ మాట్లాడుతూ విద్యార్థులు మానసిక ఆరోగ్యానికి సంబంధించిన పలు అంశాలపై అవగాహన కల్పించారు.

ఎస్ఆర్‌కేఆర్‌కు జేఎన్టీయూకే బెస్ట్ పెర్ఫార్మెన్స్ అవార్డు

భీమవరం ఎడ్యుకేషన్, ఆగస్టు 23 :జేఎన్టీయూకే 16వ వార్షికోత్సవం సందర్భంగా యూనివర్సిటీ పరిధిలో 162 ఇంజనీరింగ్ కళాశాలలు ఉండగా అందులో పది కళాశాలలను అవార్డుకి ఎంపిక చేయగా ప్రథమ స్థానంలో ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలకు బెస్ట్ పెర్ఫార్మెన్స్ అవార్డు ఇచ్చి సత్కరించారని కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.జగపతిరాజు తెలిపారు. ఆయన మాట్లాడుతూ కాకినాడలో జరిగిన జేఎన్టీయూకే వార్షికోత్సవం సందర్భంగా అవార్డు అందుకున్నట్లు తెలిపారు. కళాశాల అధ్యక్ష కార్యదర్శులు సాగి ప్రసాదరాజు, సాగి రామకృష్ణ నిశాంత్‌వర్మ మాట్లాడుతూ కళాశాల డైరెక్టర్, ప్రిన్సిపాల్, స్టాఫ్ సమష్టి కృషి ఫలితంగా అరుదైన గౌరవం దక్కిందని ప్రశంసించారు.

గృహ నిర్మాణాలకు రూ.2.30 కోట్ల మంజూరు !

ఉండి, ఆగస్టు 23: 2016-19లోని టీడీపీ హయాంలో ఎన్టీఆర్ గృహనిర్మాణ పథకంలో ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు రూ.2 కోట్ల30 లక్షలు నిధుల మంజూరు కానున్నాయని టీడీపీ మండల అధ్యక్షుడు కరిమెరక నాగరాజు తెలిపారు. శుక్రవారం ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు ఆదేశాలతో పార్టీ మండల నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. మండలంలో ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకంలో 1,283మంది లబ్ధిదారులున్నారన్నారు. అనంతరం హౌసింగ్ ఏఈ రామకృష్ణంరాజు మాట్లాడారు. టీడీపీ నాయకులు కాగిత బుజ్జి, పేరిచర్ల బాలరాజు, కరిమెరక శ్రీను, వనిమా శ్రీను, యిర్రింకి బుజ్జి, కేశన యాదగిరి, గొట్టం బాబి, కన్నెగంటి రూత్‌కళ, కత్రి శ్రీనుజయలక్ష్మి, సారేపల్లి త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధారణతో ప్రాణరక్షణ : సీఐ

తాడేపల్లిగూడెం రూరల్, ఆగస్టు 23: హెల్మెట్ ధరించడం వల్ల ప్రాణాలు కాపాడుకోవచ్చని పట్టణ సీఐ సుబ్రహ్మణ్యం అన్నారు. హెల్మెట్ ధారణపై పట్టణంలో ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో శుక్రవారం ఆదిత్య కళాశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ట్రాఫిక్ ఎస్ఐ కొండలరావు, సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికడదాం : కమిషనర్

పాలకొల్లు అర్బన్, ఆగస్టు 23 :బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతీ విద్యార్థినికి అవగాహన కల్పించాలని మున్సిపల్ కమిషనర్ ఎ.విజయ సారథి అన్నారు. స్త్రీ శిశు సంక్షేమ శాఖ, పాలకొల్లు ప్రాజెక్ట్ సీడీపీవో సీహెచ్ ఇందిర అధ్యక్షతన శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలోని స్త్రీశక్తి భవనంలో వంద రోజుల మిషన్ శక్తి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీడీపీవో ఇందిర మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో భాగంగా భేటీ బచావో, భేటీ పడావో వంటి కార్యక్రమాలతో పాటు బాల్య వివాహాలను అరికట్టేందుకు అవగాహన కల్పించడం లక్ష్యమన్నారు. మమతశ్రీ, గంగాధర శర్మ, పోలీసులు పాల్గొన్నారు.

ప్రశంసా పత్రాల అందజేత

తాడేపల్లిగూడెం అర్బన్, ఆగస్టు 23: టీడీపీ యాప్ ద్వారా పార్టీ ప్రచారం చేయడంలో అత్యధిక పాయింట్లు సాధించి మంత్రి నారా లోకేశ్ నుంచి ప్రశంసాపత్రాలను సాధించడం అభినందనీయమని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి అన్నారు. యాప్ ద్వారా మెరుగైన పాయింట్లు సాధించిన పాతూరి రాంప్రసాద్ చౌదరి, ముత్యాల శ్రీనివాస్, పొట్నూరి చంద్రశేఖర్‌లకు శుక్రవారం పార్టీ కార్యాలయం వద్ద మంత్రి లోకేశ్ పంపిన ప్రశంసాపత్రాలను అందజేశారు. గొర్రెల శ్రీధర్, పట్నాల రాంపండు, కిలపర్తి వెంకట్రావు, దాసరి అప్పన్న, బాజీ, పద్మనాభుని మురళి పాల్గన్నారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద ఆడిట్

తాడేపల్లిగూడెం రూరల్, ఆగస్టు 23: తాడేపల్లిగూడెం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద శుక్రవారం ఆడిట్ నిర్వహించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద జిల్లా సబ్ రిజిస్ట్రార్ సత్యనారాయణ పర్యవేక్షణలో ఆడిట్ నిర్వహించారు. రిజిస్ట్రేషన్‌లు మధ్యాహ్నం నుంచి నిలుపుదల చేయడంతో కక్షిదారులు రిజిస్ట్రేషన్‌లు లేకుండా వెనుదిరగాల్సి వచ్చింది.

సంక్షిప్త సమాచారం..

- **తణుకు, ఆగస్టు 23:** మద్దాల వెంకటస్వామి కౌలు రైతుల సమస్యలపై అలుపెరగని పోరాటం చేశారని మద్దాల వర్ధంతిని శుక్రవారం పురస్కరించుకుని నివాళులర్పించిన అనంతరం సీపీఎం పట్టణ కార్యదర్శి పీవీ ప్రతాప్ అన్నారు.
- **ఇరగవరం:** తూర్పు విప్పర్రులో 50 పశువులకు ఉచిత గర్భకోశ వ్యాధుల పరీక్షలు మండల పశువైద్యాధికారి డాక్టర్ పి శ్రీనివాస్ అధ్యక్షతన చేసి ఉచితంగా మందులు, పౌష్టికాహారం ప్యాకెట్లు అందించారు.
- **భీమవరం క్రైం :** విద్యార్థులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌ల మధ్య తేడా తెలుసుకోవాలని భీమవరం మండల న్యాయ సేవల కమిటీ ఆధ్వర్యంలో జరిగిన న్యాయ విజ్ఞాన సదసుసలో భీమవరం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏలేటి న్యూటన్ సూచించారు.
- **తణుకు :** అంతరిక్ష ప్రయోగాలు వల్ల మానవాళికి ఎంతో మేలు జరుగుతుందని శుక్రవారం జాతీయ అంతరిక్ష దినోత్సవ సభలో ఎస్కేఎస్డీ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ కెప్టెన్ యు.ఎల్. సుందరీబాయ్ అన్నారు.
- సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని శుక్రవారం పట్టణంలోని 16వ వార్డు, పైడిపర్రు హైస్కూలు వద్ద, ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో సబ్ యూనిట్ ఆఫీసర్ జి.వెంకటేశ్వరరావు అన్నారు.
- **పాలకోడేరు :** దూరవిద్య ద్వారా టెన్త్, ఇంటర్ అడ్మిషన్లను ఆహ్వానిస్తున్నామని పాలకోడేరులో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు దూర విద్యపై అవగాహన ర్యాలీలో పాలకోడేరు ఎంఈవో వీవీఎస్. నాగరాజు అన్నారు. అడ్మిషన్లకు ఈనెల 31వ తేదీ వరకు గడువు ఉందన్నారు.
- **పెనుగొండ :** ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన భోజనం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తుందని సిద్ధాంతం హైస్కూలులో ఎంఈవో పి.రామకృష్ణతో కలిసి మధ్యాహ్నం భోజనం రుచి సర్పంచ్ చింతపల్లి గనిరాజు అన్నారు.



వైఎస్‌పాలెంలో చంద్రబాబు, పవన్ చిత్రపటాలకు పాలాభిషేకం.. పెనుగొండలో పితాని తనయుడు వెంకట్‌కు సత్కారం.. మహదేవపట్నంలో మాట్లాడుతున్న జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి.. కాళ్లలో మాట్లాడుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు మంతెన రామరాజు

స్వర్ణ గ్రామాలుగా అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

» జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి
» గ్రామాల్లో పండుగలా గ్రామ సభలు
» ఉత్సాహంగా పాల్గొన్న ఆయా గ్రామస్థులు

వీరవాసరం, (భీమవరంటౌన్) : గ్రామాల్లో సమస్యలు పరిష్కరించి స్వర్ణ గ్రామాలుగా అభివృద్ధి చెందడమే ప్రభుత్వ ధ్యేయమని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. వీరవాసరం మండలం వీర వాసరం గ్రామ పంచాయతీ ఆవరణలో శుక్రవారం నిర్వహించిన మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం గ్రామ సభలో ఆమె మాట్లాడారు. గ్రామాల్లో సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించుటకు శ్రీకారం చుట్టిందన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన నాలుగు అంశాలపై చర్చించి గ్రామ నిర్మాణంతో గ్రామ వికాసం దిశగా అడుగులు వేయాలన్నారు. ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు మాట్లాడుతూ ప్రస్తుతం గ్రామాల అభివృద్ధి జరగాలంటే ఉపాధి హామీ నిధులు ఒక్కటే కనిపిస్తున్నాయని, ప్రజలు పూర్తిగా సహకరించాలని కోరారు. వీరవాసరం మండలంలోని గ్రామాల్లో రోడ్లు, డ్రెయిన్లు, తాగునీటి సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. డ్వామా పీడీ ప్రభాకరరావు, ఐసీడీఎస్ పీడీ బి.సుజాతరాణి, జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి శ్రీనివాసరావు, తహసీల్దార్ ఏవీ రామాంజనేయులు, ఇన్‌చార్జి ఎంపీడీవో పార్థసారథి, గ్రామ సర్పంచి చికిలే మంగతాయారు, జడ్పీటీసీ సభ్యుడు గుండా జయప్రకాష్ నాయుడు, ఎంపీపీ వీరవల్లి దుర్గభవాని, ఎంపీటీసీ సభ్యులు, టీడీపీ నాయకులు కోళ్ల నాగేశ్వరరావు, జనసేన నాయకుడు చనమల్ల చంద్రశేఖర్, టీడీపీ నాయకుడు వీరవల్లి చంద్రశేఖర్, గ్రామ సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

● నరసాపురం రూరల్/మొగల్తూరు, ఆగస్టు 23: దేశానికి పట్టుగొమ్మలు గ్రామాలే అని వాటిని బలోపేతం చేసి ప్రజలకు సుస్థిర పాలన అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ అన్నారు. శుక్రవారం నరసాపురం మండలంలోని రాజుగారితోట, సీతారాంపురం గ్రామాల్లో జరిగిన గ్రామ సభల్లో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. మండలంలోని 28 గ్రామాల్లో పండుగ వాతావరణం కనిపించింది. ఆయా గ్రామస్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వైఎస్‌పాలెం పంచాయతీలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. తహసీల్దార్ రాజరాజేశ్వరి, ఎంపీడీవో వీరభద్రరావు, సర్పంచ్‌లు వెంకట్, వైఎస్ నాగముత్యామాంబ, బాబులు, మాండ్రు మరియమ్మ పాల్గొన్నారు. మొగల్తూరు పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన గ్రామ సభలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ మాట్లాడారు. పంచాయతీ పరిధిలో గత ఏడాది ఏప్రిల్ నుంచి ఇప్పటివరకు పూర్తి చేసిన 36 పనుల వివరాలను, కొత్తగా ప్రతిపాదించిన పనుల వివరాలు ఆయన అడిగి తెలుసుకున్నారు. మొగల్తూరు సమస్యలపై అవగాహన ఉందని త్వరలో పరిష్కరిస్తామన్నారు. ఈ సందర్భంగా మొగల్తూరు పంచాయతీ పాలకవర్గ సభ్యులు, సర్పంచ్ పడవల మేరీ వార్డు సభ్యులు ఎమ్మెల్యే నాయకర్‌ను సన్మానించారు. తహసీల్దార్ విద్యాపతి, ట్రాన్స్‌కో ఏడీఈ ఓంకార్, ఎంపీడీవో బాబ్జిరాజు, నాయకులు గుబ్బల నాగరాజు, మామిడిశెట్టి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

● కాళ్ల/ఉండి/ఆకివీడు రూరల్/పాలకోడేరు:కాళ్ల మండలం కాళ్ల గ్రామంలో జరిగిన గ్రామసభకు టీడీపీ జిల్లా అధ్యక్షుడు మంతెన రామరాజు విచ్చేసి మాట్లాడారు. గ్రామాలు అభివృద్ధి పథంలో నడిస్తేనే రాష్ట్రం, దేశం బాగుంటుందన్నారు. ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు తనయుడు భరత్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ గ్రామంలో ప్రజాస్వామ్య పద్ధతిలో గ్రామ సభలు నిర్వహించడం అభినందనీయమన్నారు. సర్పంచ్ బందా విజయ, ఎంపీడీవో జి.స్వాతి తదితరులు పాల్గొన్నారు. ఉండి మండలం మహదేవపట్నం గ్రామసభలో జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్య బద్ధంగా గ్రామసభలను పెట్టుకుని గ్రామాల్లో సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి జుత్తుగ నాగరాజు మాట్లాడుతూ ప్రతీ ఒక్కరికి వంద రోజుల పనిదినాలు కల్పించాలన్నారు. అనంతరం జేసీని ఘనంగా సత్కరించారు. సర్పంచ్ వనిమా సుబ్బలక్ష్మీశ్రీను, ఉపసర్పంచ్ ముదునూరి సుబ్బరాజు, జిల్లా టెక్నికల్ కో-ఆర్డినేటర్ ఎన్. ఎడ్వర్డ్, ఎంపీడీవో రవీంద్ర తదితరులు పాల్గొన్నారు. ఆకివీడు రూరల్ గ్రామా ల్లో గ్రామాలను సమైక్యంగా అభివృద్ధి చేసుకుందామని, ప్రభుత్వం సమృద్ధిగా నిధులు మంజూరు చేసిందని గ్రామసభలు ఏకగ్రీవంగా తీర్మానించాయి. సిద్ధాపురంలోని జడ్పీ పాఠశాలకు సీసీ రోడ్డు నిర్మాణం కోసం స్కూల్ మేనేజ్ మెంట్ కమిటీ చైర్మన్ రఫీ వినతి అందజేశారు. సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వార్డు సభ్యులు పాల్గొన్నారు. పాలకోడేరు మండలం గొరగన మూడి గ్రామ సభ కాస్తం రసాభాసగా మారింది. గ్రామసభలో టీడీపీ, వైసీపీ నాయకులు రాజకీయంగా మాట్లాడడంతో ఎంపీడీవో నూకల మురళీగం గాధరరావు ఈ గ్రామసభ ఉపాధి హామీ పనులపై మాత్రమే చర్చించాలని ఎటువంటి రాజకీయ జోక్యం ఉండకూడదని ఇరువర్గాలకు సూచించడంతో గొడవ సర్దుమనిగింది. గ్రామానికి చెందిన ఎంపీటీసీ బేబికుమారి, గ్రామ సర్పంచ్ గొట్టుముక్కల శివాజీరాజు మాట్లాడుతూ ఏ పార్టీ అధికారంలో ఉన్న గ్రామంలో పంచాయతీ తీర్మానమే తుది తీర్మానమన్నారు. పంచాయతీ కార్యదర్శి సరళ, బీజేపీ నాయకుడు వెంకటేశ్వర్లు, ఉపసర్పంచ్ గుడూరి రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

● పెనుగొండ/ఆచంట/పోడూరు/పెనుమంట్ర, ఆగస్టు 23 : పెనుగొండలో జరిగిన గ్రామసభకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ తనయుడు వెంకట్ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ఎపుడూ ఇటువంటి గ్రామ సభలు నిర్వహించలేదన్నారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా 18 పనులను గుర్తించి 2 కోట్ల 15 లక్షల రూపాయలు అంచనా విలువ గ్రామసభలో ఆమోదించామని సర్పంచ్ నక్కా శ్యామలా సోని శాస్త్రి తెలిపారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘ మండల కార్యదర్శి షేక్ పాదుషా మాట్లాడుతూ ఉపాధి పనులు చేసే కార్మికులకు రూ.300 వేతనం వచ్చేలా అధికారులు కృషి చేయాలన్నారు. స్పెషల్ ఆఫీసర్ ఎంపీడీవో శ్రీనివాస దొర, మండా ప్రసాద్, బండారు కృష్ణమూర్తి, నూలి వెంకట సత్య నాగ దుర్గా భాను పాల్గొన్నారు. ఆచంట మండలంలో జరిగిన గ్రామ సభల్లో పలువురు నాయకులు మాట్లాడుతూ గ్రామంలో ముఖ్యంగా గత కొన్నేళ్ళుగా డ్రెయినేజీ వ్యవస్థ లేక గ్రామంలో మురుగు సమస్య తలెత్తిందని దీనివల్ల గ్రామంలో దోమలు ఎక్కువై అనేక రోగాలు వస్తున్నాయని కోరారు. గ్రామంలో ముఖ్యమైన సమస్యలు తీర్చాలని అధికారులను కోరారు. సభలలో జడ్పీటీసీ ఉప్పలపాటి సురేష్‌బాబు, ఎంపీపీ దిగుమర్తి సూర్యకుమారి, మండల ప్రత్యేకాధికారి పి.పిచ్చయ్య, ఎంపీడీవో నర్సింహప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. పోడూరు మండలం కొమ్ముచిక్కాలలో జరిగిన గ్రామ సభలో టీడీపీ మండల అధ్యక్షుడు గొట్టుముక్కల సూర్యనారాయణరాజు మాట్లాడుతూ ఉపాధి పథకం పనులు కూలీలకు వరం అన్నారు. రావిపాడులో జరిగిన గ్రామసభలో మాజీ ఎంపీపీ పెన్మెత్స రామభద్రరాజు మాట్లాడారు. మండలంలోని పదహారు గ్రామాల్లోనూ అధికారులు గ్రామసభలు నిర్వహించి ప్రజలు, కూలీలు సమక్షంలో ఎన్ఆర్ఈజీఎస్ పథకం ప్రణాళికలను రూపొందించారు. సర్పంచ్‌లు గుంటూరి రామకృష్ణంరాజు, పెన్మెత్స విజయలక్ష్మి, తానేటి బాబూరావు, మాజీ జడ్పీటీసీ బొక్కా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. పెనుమంట్ర మండలంలోని పద్దెనిమిది గ్రామపంచాయతీల్లోనూ సర్పంచ్‌ల అధ్యక్షతన గ్రామ సభలు నిర్వహించారు. ఉపాధి కూలీలకు వంద రోజులు పని కల్పించాలని పలువురు తీర్మానాలు చేశారని ఎంపీడీవో పి.పద్మజ తెలిపారు. నత్త రామేశ్వరంలో గత ఏడాది నిర్మించిన రహదారులు ప్రజలకు ఉపయోగం లేదని నివాస ప్రాంతాలు లేని ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణం చేపట్టారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేయడంతో వేదిక పైనుండి సర్పంచి గలగల ధర్మారెడ్డి వేదిక దిగి వెళ్లిపోయారు.

● గణపవరం : గ్రామసభల ద్వారానే గ్రామాల అభివృద్ధికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. శుక్రవారం గణపవరం గ్రామ పంచాయతీ ఆవరణలో జరిగిన గ్రామసభలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు ప్రజల నుంచి వచ్చిన వినతులను అధికారులతో కలిసి ఎమ్మెల్యే ధర్మరాజు పరిశీలించారు. సర్పంచ్ మూరా అలంకారం, టీడీపీ మండల అధ్యక్షుడు ఇందుకూరి రామకృష్ణంరాజు, ఉంగుటూరు నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు అద్దేపల్లి వాసురాజు, గణపవరం పట్టణ టీడీపీ అధ్యక్షుడు కూసంపూడి సురేంద్రకుమార్‌రాజు పాల్గొన్నారు.

● అత్తిలి/ఇరగవరం: గ్రామాలు ఆర్థిక పరిపుష్టి సాధించినప్పుడే ప్రగతి సాధ్యపడుతుందని ఎంపీడీవో అమీలు జమా అన్నారు. అత్తిలి మండలంలోని 18 పంచాయతీలలో గ్రామసభలు జరిగాయి. అత్తిలిలో సర్పంచ్ గంటా విజేత నాగరాజు అధ్యక్షతన జరిగిన గ్రామ సభలో సెక్రటరీ సుజాత మాట్లాడుతూ గ్రామానికి ఏఏ అవసరాలు ఉన్నాయనేది గుర్తించి, ఆ పనులకు గ్రామ తీర్మానాల ద్వారా కలెక్టర్ కార్యాలయానికి పంపించాల్సి ఉందన్నారు. ఇరగవరం మండలంలోని రేలంగి గ్రామంలో మినీ గోకులాల నిర్మాణంతో పాటు 36 పనులకు గాను మూడు కోట్ల 27 లక్షలతో సీసీ రోడ్లు, డ్రెయినేజీ వ్యవస్థ మంజూరుకు తీర్మానించినట్లు ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు.



కె.పెంటపాడు గ్రామ సభలో మాట్లాడుతున్న బాబ్జి

'ఉపాధి' వైసీపీ హామీ పథకంగా మారింది : ఎమ్మెల్యే బొలిశెట్టి

తాడేపల్లిగూడెం రూరల్/పెంటపాడు, ఆగస్టు 23: ఉపాధి హామీ పథకం గత ఐదేళ్లల్లో వైసీపీ హామీ పథకంగా చలామణి అయిందని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ విమర్శించారు. తాడేపల్లిగూడెం మండలం అప్పారావుపేట, కృష్ణాయపాలెం గ్రామాల్లో పెంటపాడు మండలం ప్రత్తిపాడులో గ్రామ ప్రత్యేకాధికారి, ఎంపీడీవో బాలాజీ వెంకటరమణ అధ్యక్షతన జరిగిన గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాలను సమైక్యంగా అభివృద్ధి చేసుకుందామని పిలుపునిచ్చారు. మెట్ట ఉప్పరగూడెంలో నిర్వహించిన గ్రామ సభలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వలవల బాబ్జి పాల్గొని గ్రామాభివృద్ధికి పలు సూచనలు చేశారు. సర్పంచ్‌లు బేతపూడి వెంకటలక్ష్మి, ఆరుగొల్లు శ్రీనివాస్, మర్లపాటి సుబ్బలక్ష్మి, కూటమి నాయకులు పాల్గొన్నారు. పెంటపాడు మండలంలో డీపీవో ఆర్.విక్టర్, ఎంపీపీ దాసరి హైమవతి, కిలపర్తి వెంకట్రావు, దాసరి అప్పన్న, పుల్లా బాబి, చెరుకూరి జగత్ సోమశేఖర్, తహసీల్దార్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. పెంటపాడు మండలం కె.పెంటపాడు, పెంటపాడు గ్రామాల్లో సర్పంచ్‌లు పీతల సత్యనారాయణ, తాడేపల్లి సూర్యకళ అధ్యక్షతన నిర్వహించిన గ్రామ సభల్లో ముఖ్య అతిథిగా టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి పాల్గొన్నారు.



టంగుటూరి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి నిమ్మల, అంగర.. భీమవరంలో ప్రకాశం పంతులు చిత్ర పటం వద్ద అడిషనల్ ఎస్పీ భీమారావు నివాళి

'టంగుటూరి' సేవలు తెలుగు ప్రజలకు స్ఫూర్తిదాయకం

» మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు

పాలకొల్లు టౌన్/పాలకొల్లు అర్బన్/రూరల్, ఆగస్టు 23 :ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తొలి సీఎం టంగుటూరి ప్రకాశం పంతులు సేవలు తెలుగు ప్రజలకు స్ఫూర్తిదాయకమని మంత్రి రామానాయుడు అన్నారు. స్థానిక గాంధీబొమ్మల సెంటర్లో ప్రకాశం పంతులు జయంతి ఉత్సవాల్లో భాగంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శ్రీక్షీరారామ బ్రాహ్మణ సేవాసంఘం ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పెచ్చెట్టి బాబు, జిల్లా జనసేన కార్యదర్శి బోనం చినబాబు, పట్టణ టీడీపీ, బీజేపీ అధ్యక్షులు గండేటి వెంకటేశ్వరరావు, జక్కంపూడి కుమార్, టీడీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కర్నేన గౌరునాయుడు, ధనాని సూర్యప్రకాష్, చిన్నమిల్లి గణపతిరావు, బ్రాహ్మణ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

● పాలకొల్లులో వీవర్స్ కాలనీలోని మున్సిపల్ ఎలిమెంట్రీ పాఠశాలలో ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం ఆర్.భవానీ ప్రసాద్ ఆధ్వర్యంలో ప్రకాశం పంతులు చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. పెదమామిడిపల్లిలో గ్రామ ఆలయ పూజారి చేబ్రోలు బాలకృష్ణ గాంధీ ఆధ్వర్యంలో ప్రకాశం పంతులు జయంతి వేడుకలు నిర్వహించారు. విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు.

● భీమవరం క్రైం/భీమవరం టౌన్ : దేశం కోసం ప్రకాశం పంతులు సాహసం నేటి యువతకు స్ఫూర్తి కావాలని జిల్లా అడిషనల్ ఎస్పీ వి.భీమారావు అన్నారు. టంగుటూరి ప్రకాశం పంతులు 153వ జయంతి వేడుకలు శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. తొలుత ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. జిల్లా కలెక్టరేట్ వశిష్ట కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా వెనుక బడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రకాశం పంతులు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. జేసీ టి.రాహుల్ కుమార్ రెడ్డి ప్రకాశం పంతులు చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం జిల్లా రెవెన్యూ అధికారి జె.ఉదయ భాస్కరరావు మాటాడారు. జిల్లా వెనుక బడిన తరగతుల సంక్షేమ అధికారి జి.గణపతి రావు, బీసీ సంక్షేమ శాఖ ఏఎస్‌డబ్ల్యూవోలు, వసతి గృహాల వార్డెన్లు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. భీమవరం పట్టణంలోని పీఎస్ఎం బాలికోన్నత పాఠశాలలో టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి కార్యక్ర మాన్ని శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో నిర్వహించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యేలేటి న్యూటన్, ఉత్సవ కమిటీ సభ్యులు చెరుకువాడ రంగసాయి, అరసవల్లి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ దశాబ్ద కాలంగా ఈ ప్రకాశం చౌక్‌లో ఆయన విగ్రహం నెలకొల్పేలా ప్రయత్నాలు చేస్తున్నామని, త్వరలోనే విగ్రహ ప్రతిష్ఠ జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

● కాళ్ళ : ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు పోరాడిన స్ఫూర్తితో విద్యార్థులు ముందుకు సాగాలని పాఠశాల హెచ్ఎం బీఆర్ఎంకే స్వామి అన్నారు. కాళ్ళ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల స్పెషల్ సీసలిలో శుక్రవారం ప్రకాశం పంతులు 152వ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు, ఎస్.విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రకాశం పంతులు జీవిత చరిత్ర వివరించి స్వీట్స్ పంపిణీ చేశారు.

● ఆచంట/పెనుగొండ/పెనుమంట్ర, : ప్రకాశం పంతులు ఆశయాలకు అనుగుణంగా మనందరం నడుచుకోవాలని ఎంపీపీ దిగుమర్తి సూర్యకుమారి, జడ్పీటీసీ ఉప్పలపాటి సురేష్‌బాబు అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద ప్రకాశం పంతులు జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో నరసింహప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు. పెనుగొండ గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద కార్యాలయ సిబ్బంది ప్రకాశం పంతులు చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఎంపీడీవో సుండం శ్రీనివాస దొర, సర్పంచ్ నక్కా శ్యామలా సోని శాస్త్రి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. పెనుమంట్ర మండలం మార్టేరులో వ్యవసాయపరిశోధనా కేంద్రం, వ్యవసాయ పాలిటెక్నిక్ ఆధ్వర్యంలో మార్టేరు వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్. డాక్టర్ టి.శ్రీనివాస్ అధ్యక్షతన ప్రకాశం పంతులు జయంతిని ఘనంగా నిర్వహించారు. శాస్త్రవేత్తలు, వ్యవసాయ పాలిటెక్నిక్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

● మొగల్తూరు : మొగల్తూరు, ముత్యాలపల్లి గ్రామాల్లో గ్రామ పంచాయతీ వద్ద జరిగిన కార్యక్రమంలో ప్రకాశం చిత్ర పటానికి ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ పూల మాలలు వేసి నివాళులర్పించారు. ముత్యాలపల్లి ఉన్నత పాఠశాలలో ఆరోగ్య వర్షిణి సంస్థ ఆధ్వర్యంలో ప్రకాశం విగ్రహం వద్ద నివాళులర్పించారు.

ప్రతి అవకాశాన్ని నిరుద్యోగులు వినియోగించుకోవాలి : కలెక్టర్

» జాబ్‌మేళాలో 195 మందికి ఉద్యోగాలు



నిరుద్యోగుల వివరాలను తెలుసుకుంటున్న కలెక్టర్

నరసాపురం టౌన్,ఆగస్టు 23: నేటి పోటీ ప్రపంచంలో వచ్చిన ప్రతి అవకాశాన్ని నిరుద్యోగులు వినియోగించుకున్నప్పుడే ఉన్నత స్థితికి చేరుకోగలరని జిల్లా కలెక్టర్ నాగరాణి అన్నారు. శుక్రవారం వైఎన్ కళాశాలలో ఏపీ నైపుణ్య అభివృద్ధి సంస్థ, వైఎన్ కళాశాల కేరీర్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్‌మేళాకు జిల్లా నలుమూలల నుంచి వెయ్యి మంది నిరుద్యోగులు హాజరయ్యారు. 19 కార్పొరేట్ సంస్థల హెచ్‌ఆర్‌లు హాజరై 195 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించారు. ఈ మేళాను ఎమ్మెల్యే నాయకర్ ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా కలెక్టర్ హాజరై కంపెనీ ప్రతినిధులతో మాట్లాడారు. కొంతమంది నిరుద్యోగుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఆర్డీవో అంబరీష్, కరస్పాండెంట్ డాక్టర్ చినమిల్లి సత్యనారాయణ, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి కృష్ణారెడ్డి, పీడీ వేణుగోపాల్, పరిశ్రమలశాఖ అధికారి మంగపతిరావు, లీడ్ బ్యాంకు మేనేజర్ నాగేంద్రప్రసాద్, ఎంప్లాయిమెంట్ అధికారి వరలక్ష్మి, ప్రిన్సిపాల్ కనకరాజు, డైరెక్టర్ చింతారావు, చినమిల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

'మొలకెత్తిన విత్తనాలుంటే తెలపాలి'

నరసాపురం రూరల్, ఆగస్టు 23: ప్రభుత్వం రైతులకు సబ్సిడీపై అందిస్తున్న విత్తనాల్లో ఎక్కడైన రెండు రకాలు కలిసినా.. లేక మొలకెత్తిన.. పిలకలు వచ్చినా.. రైతులు వ్యవసాయశాఖ అధికారుల దృష్టికి తీసుకురావాలని జిల్లా వ్యవసాయశాఖ జేడీ వెంకటేశ్వర్లు కోరారు. ఆంధ్రజ్యోతిలో ఈనెల 19న ప్రచురితమైన విత్తకుండానే మొలకలు అనే వార్తపై ఆయన స్పందించారు. దీనిపై విచారణ జరిపించామన్నారు. కొన్ని చోట్ల సీడ్ శాంపిల్స్ తీసి టీపీగూడెంకు నమూనాలను పంపామన్నారు. విత్తనాలు సరఫరా చేసినా ఏపీ సీడ్స్ దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లామన్నారు. ఇప్పటికే దీనిపై నరసాపురం వ్యవసాయశాఖ అధికారి ప్రాథమిక విచారణ చేశారని జేడీ చెప్పారు

మహిళలకు ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

పాలకొల్లు టౌన్, ఆగస్టు 23 : పాలకొల్లు యునైటెడ్ కాపు ఇంటర్నేషనల్ సర్వీస్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక మన్యం జగ్గమ్మగారి సత్రంలో మహిళలకు ఉచిత ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో మణిపాల్ హాస్పటల్ వైద్య నిపుణులచే 213 మంది మహిళలకు క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. క్లబ్ గవర్నర్ పెనుమాక రామ్మోహన్‌రావు, అధ్యక్ష కార్యదర్శులు జక్కంపూడి మదన్, వేరుకొండ దుర్గాప్రసాద్, సత్రం ఈవో ముచ్చర్ల శ్రీనివాస్, పోకల రాము, జక్కంపూడి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

పెద్దింట్లమ్మ సన్నిధిలో కుంకుమ పూజలు

ఆకివీడు, ఆగస్టు 23 : ఆకివీడు పెద్దింట్లమ్మ దేవస్థానంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా మహిళలు సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. మొవ్వా పట్టాభిరామయ్య మనుమడు కొల్లిపర హేమంత్ వజ్రాల ముక్కెర, విజయవాడకు చెందిన వైద్యురాలు మేఘన, కుటుంబీకులు మంగళసూత్రం అందజేశారు.

● ఆకివీడు రూరల్ : దుంపగడప గ్రామదేవతలైన భూలక్ష్మమ్మ, వెంకమ్మ, మారెమ్మ అమ్మవార్లకు శ్రావణమాసం మూడో శుక్రవారం ఆలయ పునర్నిర్మాణ వార్షికోత్సవం కావడంతో మహిళలు సహస్ర కలశాలతో ఊరేగింపుగా వచ్చి అమ్మవార్లను అభిషేకించారు. శనివారం అన్నసమారాధన నిర్వహిస్తామని ఆలయ నిర్వాహకులు తెలిపారు.



ఆకివీడు పెద్దింట్లమ్మ దేవస్థానంలో కుంకుమ పూజలు.. తాడేపల్లిగూడెంలో వరలక్ష్మి వ్రతాలు

●పెనుగొండ : శ్రావణ మాసం శుక్రవారం సందర్భంగా శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారు శుక్రవారం ప్రత్యేక అలంకరణలో దర్శనం ఇచ్చారు. ఈ సందర్భంగా భక్తులు దర్శించుకుని పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

● తాడేపల్లిగూడెం రూరల్ : తాడేపల్లిగూడెం గ్రామదేవత బలుసులమ్మ ఆలయం వద్ద శ్రావణ శుక్రవారం సందర్భంగా ఆలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. అమ్మవారికి మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం జరిగింది. జనసేన యువనేత బొలిశెట్టి రాజేష్, ఆలయ కమిటీ పెద్ద శ్రీరంగం రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

● పాలకొల్లు అర్బన్ : స్థానిక యడ్లబజారులోని పంచముఖాంజనేయ స్వామి ఆలయంలో పలు పదార్థాలను కైంకర్యం చేయడానికి ఇత్తడి పాత్రలు, గరిటెలను టీడీపీ నాయకుడు గాదె వెంకన్న పుట్టినరోజు సందర్భంగా బహూకరించారు. ఇత్తడి సామగ్రిని అర్చకులు ఎస్‌టీరమణ స్వామి, రఘుబాలు సంప్రోక్షణలు గావించి, వెంకన్న పేరుతో స్వామికి ప్రత్యేక పూజలు చేశారు

● పాలకొల్లు అర్బన్ : స్థానిక కోడిగట్టున గల శంకర మఠంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా మహిళలు సామూహికంగా కుంకుమ పూజలు నిర్వహించారు. ముందుగా మహిళలు గోపూజలు నిర్వహించారు. టీటీడీ, హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో మూడు రోజులుగా మఠంలో పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలను చేపట్టారు. ఆధ్యాత్మిక ప్రవచనం గావించిన తెలుగు అధ్యాపకుడు చాగంటి లింగరాజును ఘనంగా సత్కరించారు. సంస్కృత విశ్రాంత అధ్యాపకుడు వీకే సత్యనారాయణ, విశ్రాంత బ్యాంక్ ఉద్యోగి పోతుల సూర్యనారాయణ ఆలయ కమిటీ సభ్యులు సత్తిరాజు కేశవరావు, భక్తులు పాల్గొన్నారు.